


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి   శుక్రవారం 23 ఏప్రిల్ 2021 సంపుటి : 02   సంచిక : 284   పేజీలు : 4   వెల : రూ 3-00


## కరోనా వ్యాక్సిన్ల ధరల వ్యత్యాసంపై కేటీఆర్ అసంతృప్తి

రాష్ట్రాలపై పడే అదనపు భారాన్ని పీఎంకేర్ భరించాలి

హైదరాబాద్ ఏప్రిల్ 22  దేశంలో కరోనా వ్యాక్సిన్ల ధరల వ్యత్యాసంపై తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రానికి రూ.150కి, రాష్ట్రాలకు రూ.400 టీకా సరఫరా చేస్తామని ఓ వ్యాక్సిన్ కంపెనీ ప్రకటించడంపై ఈ మేరకు ఆయన గురువారం ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఒకే దేశం ? ఒకే పన్ను కోసం జీఎస్టీని అంగీకరించామని, కానీ, ఇప్పుడు ఒకే దేశంలో ఒకే వ్యాక్సిన్‌కు రెండు ధరలు చూస్తున్నామని విమర్శించారు. టీకాల కొనుగోళ్లలో రాష్ట్రాలపై పడే అదనపు భారాన్ని పీఎం కేర్ నుంచి భరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మే6 ముహూర్తం కుదరినట్టేనా






విశాఖపట్టణం, ఏప్రిల్ 22, ( విభారె ప్రతినిధి) ఏపీ సీఎం జగన్ అనుసరిస్తున్న పంథా చూస్తే.. నిన్న మొన్నటి వరకు వ్యక్తులు, కులాలను టార్గెట్ చేసుకుని ముందుకు సాగిన ఆయన.. ఇప్పుడు ఏకంగా ప్రాంతాలను కూడా తన వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు పొలిటికల్ పండితులు. ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు.. స్తబ్దుగా ఉన్న వైసీపీ నాయకులు.. సీఎం జగన్ కూడా .. ఎన్నికల్లో రెండేళ్ల పాలన ఎఫెక్ట్ పడుతుందని భావించారు.. ఎంత ధైర్యం ఉన్నప్పటికీ.. లోలోన మాత్రం టీడీపీ ఎఫెక్ట్ కనిపించింది. దీంతో వ్యూహాత్మకంగా వ్యవహరించారు.. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా క్లీన్ స్వీప్ చేసేశారు.ఇక, ఇప్పుడు తాము తీసుకుంటున్న నిర్ణయాలకు, తాము చేస్తున్న పనులకు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి ఆమోదం లభించిందనే వైసీపీ భావిస్తోంది. ఈ క్రమంలో ఇప్పుడు అత్యంత కీలకమైన మూడు రాజధానుల దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో అమరావతి నిర్మాణానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి.. అమరావతిని కాదని.. మూడు రాజధానులను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన తర్వాత.. ఉద్యమాలు చెలరేగాయి. అయితే.. ఇప్పుడు అమరావతి ఉద్యమాన్ని నెమ్మదించేలా చేసి.. పని చక్కబెట్టుకునేందుకు ముందుకు సాగుతున్నారు.మూడు దశల్లో అమరావతిలో ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు జగన్ వ్యూహాత్మకంగా అడగులు వేస్తున్నారు.. ఈ క్రమంలోనే తాజాగా 3000 కోట్ల రూపాయల రుణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక, విశాఖలో మే 6న నూతన రాజధానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రోడ్ల విస్తరణ, గాలి పొల్యూషన్ తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇక, మరో కీలక రాజధానిగా పేర్కొంటున్నన్యాయ రాజధాని.. కర్నూలుపైనా జగన్ సెంటిమెంటు రాజకీయం చేశారు. తాజాగా ఇక్కడ న్యాయరాజధాని వద్దు అనే వారు పెరుగుతున్నారు.. ఇస్తే.. పూర్తి స్థాయి రాజధాని కావాలని అంటున్నారు.ఈ క్రమంలోనే తాజాగా సీఎం జగన్ ఇక్కడ సెంటిమెంటును తనకు అనుకూలంగా మార్చుకున్నారు. తాజాగా ప్రారంభించిన ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉయ్యాల వాడ నరసింహారెడ్డి పేరును పెడుతున్నట్టు చెప్పారు. దీనికి మెగా స్టార్ చిరంజీవి వంటివారినుంచి కూడా మద్దతు లభించింది. దీంతో స్తానికంగా జగన్‌ను విమర్శించే గొంతులు మూగబోయాయి. మొత్తంగా చూస్తే.. అటు వ్యక్తులను, సామాజిక వర్గాలను ఇప్పటి వరకు టార్గెట్ చేసిన జగన్.. ప్రాంతాలపై కూడా పట్టు సాధిస్తుండడం గమనార్హం.




తిరుపతి, ఏప్రిల్ 22, ( విభారె ప్రతినిధి) తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలు ముగిశాయి. ఇప్పుడు రాజకీయ పార్టీలు ఓట్లు, మెజార్టీలపై అంచనాలు వేస్తున్నాయి. ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయని ముందునుంచీ ప్రచారం జరిగింది. అయితే, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార పార్టీ పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేయించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశపడుతున్నట్లు నాలుగు నుంచి ఐదు లక్షల మెజార్టీ సాధ్యమేనా? ఇలా అనేక చర్చలు ప్రస్తుతం సాగుతున్నాయి. వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తే అంత భారీ మెజార్టీ సాధ్యం కాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. 2019 ఎన్నికల్లో 79 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం 64.29 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అంటే, గతం కంటే దాదాపు 15 శాతం తక్కువ పోలింగ్ జరిగింది. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పెద్ద ఎత్తున దొంగ ఓట్ల దుమారం రేగినా, అక్కడ 50.58 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. స్థానికులు ఓటింగ్‌కు రాకపోవడానికి కారణాలు అన్వేషిస్తున్నారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో గూడూరు, సర్వేపల్లి, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజాప్రతినిధులు ఉండడంతో అధికార పార్టీదే గెలుపనే ప్రచారం తొలి నుంచి సాగుతోంది. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపాలిటీలు, జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో అత్యధిక స్థానాలు అధికార వైసిపి సొంతం చేసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రతిని ధులుగా ఎన్నికైన వారు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి గట్టిగా పని చేశారు. ఇదే సమయంలో ఉద్యోగులు, కొందరు యువకుల నుంచి పట్టణ ప్రాంతాల్లో అధికార పార్టీకి వ్యతిరేక పవనాలు కనిపించాయి. తిరుపతి ఉప ఎన్నికల పోరు హోరాహోరీగా సాగాయి. ప్రచార సమయంలో టిడిపి ముందు కొచ్చింది. చంద్రబాబు, నారా లోకేష్ విస్తృత ప్రచారం నిర్వహించారు. పోలింగ్ నాటి పరిస్థితిని బేరీజు వేసుకొని మెజార్టీ తగ్గుతుందన్న భావనతోనే వైసిపి తిరుపతిలో అక్రమా లకు పాల్పడిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో అప్పటి వైసిపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసావరావుకు 7,22,877 ఓట్లు, టిడిపి అభ్యర్థి పనబాక లక్ష్మికి 4,94,501 ఓట్లు వచ్చాయి. సుమారు 2,28,376 ఓట్ల మెజార్టీతో బల్లి దుర్గాప్రసాద్ గత ఎన్నికల్లో విజయం సాధించారు. మొత్తం ఓట్లలో వైసిపికి 55 శాతం, టిడిపికి 38 శాతం ఓట్లు వచ్చాయి. గతం కన్నా ఇప్పుడు 15 శాతం పోలింగ్ తక్కువ నమోదైంది. మొత్తం ఓట్లు 10.99 లక్షలు మాత్రమే. ఈ ఓట్లతో ముఖ్యమంత్రి ఆశపడుతున్నట్లు భారీ మెజార్టీ రావడం సాధ్యం కాదని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత రాజకీయ పార్టీలు ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. ఈ ఉత్కంఠకు తెరపడాలంటే మే రెండో తేదీ వరకు వేచి చూడాల్సిందే.

# కరోనా పాజిటివ్ కేసుల్లో ఇండియాలో వరల్డ్ రికార్డ్




న్యూ ఢిల్లీ ఏప్రిల్ 22  ఇండియాలో కరోనా మహా విలయం కొనసాగుతోంది. పాజిటివ్ కేసుల్లో మన దేశం వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేసింది. రోజువారీ పాజిటివ్ కేసుల్లో గత 24 గంటల్లో 3.14 లక్షల కేసులు నమోదు అయ్యాయి. ప్రపంచంలోనే ఒకే రోజు ఇన్ని కేసులు ఓ దేశంలో నమోదు కావడం ఇదే మొదటిసారి. దీంతో దేశవ్యాప్తంగా పాజిటివ్ కేసుల సంఖ్య 1.59 కోట్లకు చేరింది.కరోనా సెకండ్ వేవ్.. భారత్‌లో పెను సవాళ్లను విసిరింది. ఇప్పటికే ఆక్సిజన్ అందక అనేక మంది అసువులుబాస్తున్నారు. యాంటీ వైరల్ డ్రగ్ రెమిడిసివిర్‌కు భారీ డిమాండ్ ఉన్నది. గతంలో అమెరికా పేరిట ఉన్న పాజిటివ్ కేసుల రికార్డును భారత్ తిరగరాసింది. జనవరిలో అమెరికాలో ఓ రోజు అత్యధికంగా 2,97,430 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇప్పుడు ఆ కేసు లోడ్‌ను భారత్ దాటేసింది.ఏప్రిల్ 15వ తేదీ నుంచి ప్రతి రోజు రెండు లక్షలకుపైగా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి. ఇంకా సెకండ్ వేవ్ తారాస్థాయికి చేరలేదు. ఇప్పట్లో కరోనా తన ఉగ్రరూపాన్ని కోల్పోయే ఛాన్సులేదని నిపుణులు చెబుతున్నారు. గత 24 గంటల్లో మహారాష్ట్ర(67,468), యూపీ(33,106), ఢిల్లీ (24,638), కర్నాటక (23,558), కేరళ(22,414)లో అత్యధిక సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి.

# కోవిడ్‌పై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు




అమరావతి:( విభారె ప్రతినిధి)  కోవిడ్-19ను కట్టడి చేయడంలో భాగంగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ద్వారా కీలక సర్క్యులర్ విడుదలైంది. సబార్డినేట్ కోర్టులు సహా ట్రిబ్యునల్, లేబర్ కోర్టులు, న్యాయసేవా సంస్థలు, జిల్లా యూనిట్లలో 50 శాతం మంది మాత్రమే సిబ్బంది విధులకు హాజరుకావాలని మిగిలిన 50 శాతం మంది తరువాత రోజు విధులకు రావాలని హైకోర్టు పేర్కొంది. ఎవరైతే విధులకు హాజరు కారో వారు ఫోన్ కాల్‌లో అందుబాటులో ఉండి అవసరమైతే అత్యవసరంగా విధులకు హాజరుకావాలని గురువారం నాటి ఆదేశాల్లో పేర్కొంది. న్యాయస్థానాల ఉద్యోగులు ఎవరూ ముందస్తు అనుమతులు లేకుండా హెడ్ క్వార్టర్స్‌ను వదిలి వెళ్లకూడదని, హైకోర్టులోకి ప్రవేశించేముందు పూర్తిస్థాయిలో శానిటైజేషన్ చేసుకొని, మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించి హాజరుకావాలని సూచించింది. ఈ ఆదేశాలు రేపటి నుంచి అమలులోకి వస్తాయని సర్క్యులర్‌లో హైకోర్టు పేర్కొంది.

# దేశంలో కరోనా...కేంద్ర ప్రభుత్వంపై సుప్రీం సీరియస్




దేశంలో ప్రస్తుత కోవిడ్ పరిస్థితులపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. దేశంలో తీవ్ర ఆక్సిజన్ కొరత ఏర్పడి పరిస్థితి అల్లకల్లోంగా మారిందని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో కేంద్రం తీరుపై అసహనం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. చోద్యం చూడటం సరికాదని చురకలంటించింది. ప్రస్తుత కోవిడ్ సంక్షోభానికి సంబంధించి నాలుగు అంశాలను సుమోటాగా స్వీకరిస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే ధర్మాసనం పేర్కొంది. ఈ గందరగోళ పరిస్థితికి కారణాలపై పరిశీలనకు ఆరు వేర్వేరు హైకోర్టులు తమ అధికార పరిధి మేర పనిచేస్తాయని తెలిపింది. అంతేకాదు, ఇందుకు అమికస్ క్యూరీగా సీనియర్ లాయర్ హరీశ్ సాల్వేను నియమించింది. ఆక్సిజన్ కొరత, వివిధ రాష్ట్రాలకు ఆక్సిజన్ పంపిణీ, అత్యవసర ఔషధాల సరఫరా, దేశంలోని ప్రజలందరికీ వ్యాక్సినేషన్, మినీ-లాక్‌డౌన్‌ల విధింపుపై రాష్ట్రాలకున్న అధికారం ఈ నాలుగు అంశాలను సుప్రీంకోర్టు పరిశీలించనుంది. ఈ అంశాలను సుమోటాగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. కోవిడ్-19 సన్నద్ధత ప్రణాళికపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. శుక్రవారం ఈ అంశంపై విచారణ చేపడతామని పేర్కొంది.పార్టీలు తమ ప్రణాళికను హైకోర్టుల ముందు కూడా కొనసాగించవచ్చని జస్టిస్ రవీంద్ర భట్ అన్నారు. దేశంలో ఆక్సిజన్ కొరత తీవ్రంగా ఉందని వ్యాఖ్యానించిన న్యాయస్థానం... ఈ విషయంలో ఎటువంటి చర్యలు తీసుకున్నారని కేంద్రాన్ని ప్రశ్నించింది. దేశ వ్యాప్తంగా పరిస్థితి అల్లకల్లోలంగా మారిందని, చోద్యం చూడడం సరికాదని కేంద్రంపై చీఫ్ జస్టిస్ మండిపడ్డారు.ఆక్సిజన్, ఔషధాల కొరతపై కేంద్రానికి నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగానే ఈ అంశంపైనే ఢిల్లీ హైకోర్టు సైతం కేంద్రానికి చురకలంటించింది. వాస్తవిక తను ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోందని, ఆక్సిజన్ కొరతతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దేశంలో కరోనా మహమ్మారి ప్రళయంగా ఉంది.రోజువారీ కేసుల్లో భారత్ కొత్త రికార్డులను నెలకొల్పుతోంది. అమెరికా ఇప్పటి వరకూ రోజువారీ కేసుల్లో తొలిస్థానంలో ఉండగా.. తాజాగా ఆ రికార్డును భారత్ అధిగమించింది. గడచిన 24 గంటల్లో అత్యధికంగా 3.15 లక్షలకుపైగా కేసులు, 2వేలకుపైగా మరణాలు నమోదయ్యాయి. ఇప్పటి వరకూ ప్రపంచంలో మరే దేశంలోనూ రోజువారీ కేసులు ఇంత పెద్ద సంఖ్యలో నిర్ధారణ కాలేదు.

# నన్ను ఇరికించేందుకే కేసు పెట్టారు: దేవినేని

అమరావతి:( విభారె ప్రతినిధి)  ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియోను మార్ఫింగ్ చేశానని తనపై సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వేసిన క్వాష్ పిటీషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. సీఐడీ అధికారులు తనను ఇరికించేందుకే కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరఫున వాదనలు విన్న న్యాయస్థానం దర్యాప్తు అధికారిని మార్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిబంధన 41 కింద ఆయనకు రక్షణ కల్పించాలని సూచించింది. ఈనెల 29న మంగళగిరి సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని దేవినేని ఉమను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను మే 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు దేవినేని ఉమపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సీఐడీ అధికారులకు న్యాయస్థానం ఆదేశించింది.



# సుప్రీం కోర్టులోనూ కరోనా కలకలం



సుప్రీం కోర్టులోనూ కరోనా వైరస్ కలకలం సృష్టించింది. సుప్రీంకోర్టులో 15 మంది న్యాయమూర్తులకు కరోనా సోకినట్లు తేలింది. అందులో ఒకరు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. తమ సిబ్బందికి కరోనా వచ్చిందని ముగ్గురు న్యాయమూర్తులు వెల్లడించారు. కరోనా రెండో దశ వ్యాప్తి సుప్రీంకోర్టును కుదిపేస్తోంది. ఇప్పటికే వైరస్ ప్రభావం కేసుల విచారణపై పడింది. తాజాగా.. సుప్రీంకోర్టులో 15 మంది న్యాయమూర్తులకు కరోనా సోకినట్లు తేలింది. అందులో ఒకరు ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. అదేసమయంలో, తమ సిబ్బందికి కరోనా సోకిందని.. న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ సూర్యకాంత్?లు వెల్లడించారు.తొలి దశలో కరోనా వ్యాప్తి సందర్భంగా సుప్రీంలో ఎటువంటి పరిస్థితి ఉండేదో.. ప్రస్తుతం అదే విధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. న్యాయమూర్తులు తమ స్వస్థలాల నుంచే వర్చువల్ ?గా వాదనలు వింటున్నారు. ఇప్పుడు.. 11 న్యాయమూర్తులతో కూడిన నాలుగు బెంచీలు వాదనలు ఆలకిస్తున్నాయి.పరిమితమైన కేసులను మాత్రమే విచారిస్తున్నాయి. సుప్రీంలోని న్యాయమూర్తులందరికీ నెల క్రితమే వ్యాక్సిన్ అందించారు. న్యాయవాదులు, సిబ్బందికి టీకా ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. లక్షణాలు ఉన్నవారికి ఆర్?టీ-పీసీఆర్ పరీక్షలు తప్పనిసరి చేసింది న్యాయస్థానం. కరోనా? లక్షణాలు కనిపిస్తే కోర్టుకు రావొద్దని సూచించింది.

# 27న తేలనున్న జగన్ బెయిల్ భవితవ్యం

అమరావతి:( విభారె ప్రతినిధి)  ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ ఎంపీ రఘురామకృష్ణ ధాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ కోర్టు విచారణ చేపట్టింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జగన్‌పై 11 చార్జ్‌షీట్‌లను సీబీఐ నమోదు చేసిందని పిటీషనర్ వాదనలు వినిపించారు. పిటీషనర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నారాయణ రావువాదనలు వినిపించారు. పిటీషన్ అర్హతపై కోర్టులో వాదనలు కొనసాగాయి. అయితే పిటీషన్‌ను విచారించాలా లేదా అన్నదానిపై ఈ నెల 27న సీబీఐ కోర్టు నిర్ణయం తెలుపనుంది. ఈ క్రమంలో తదుపరి విచారణను ఈ నెల 27కు సీబీఐ న్యాయస్థానం వాయిదా వేసింది.

# సంపాదకీయం

శుక్రవారం 23 ఏప్రిల్ 2021

## కామన్ మ్యాన్ నుంచి సెలబ్రిటీ వరకు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మొదలు తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ వరకూ రాజు పేద తేడాల్లేవు. అందరికీ కరోనా తన దెబ్బ చవి చూపిస్తోంది. అంతర్జాతీయ సమాజాన్ని కుదిపేసిన కరోనా మొదటి వేవ్ భారత దేశంలోనూ అనేక మంది ప్రముఖుల ను బలి తీసుకుంది. రెండో వేవ్ లో కేసుల సంఖ్య పెరుగుతున్నప్ప టికీ ప్రాణాంతకంగా లేదని మొదట్లో భావించారు. కానీ క్రమేపీ తీవ్రత పెరుగుతోంది. రాజకీయ ప్రముఖులపైనా విరుచుకుపడు తోంది. సాధారణంగా కేసీఆర్ జనజీవనానికి దూరంగానే ఉంటారు. ఫామ్ హౌస్ నుంచి లేదా క్యాంప్ కార్యాలయం నుంచే సమీక్షలు నిర్వహిస్తుంటారు. నిరంతరం సమీక్షలు ఉండవు. అవసరమైన సందర్భాల్లో అత్యవసరమైన విషయాల్లో మాత్రమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటారు. సాధారణ పరిపాలన వ్యవహారాలను ఆయన నిరంతరం మోనిటర్ చేసేదేమీ ఉండదు. అయినా కేసీఆర్ కు కరోనా సోకడం అంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కమ్ము కుని వస్తోందనే విషయం అర్థమవుతోంది. సాధారణ ప్రజలు మరింత అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ప్రజల్లోనూ, రాజకీయ పార్టీల్లోనూ అలవిగాని నిర్లక్ష్యం కనిపిస్తోం ది. తొలి విడత కరోనా నెమ్మదించిన తర్వాత విశృంఖలమైన స్వేచ్ఛ లభించినట్లు ప్రజలు భావించారు. రాజకీయ పార్టీలు, నేతలు సైతం పూర్తి ఉదాసీనత కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా జాగ్రత్తలను విస్మరిం చారు. ప్రచారం నుంచి ఓటింగ్ వరకూ యథేచ్ఛగా ప్రవర్తించారు. నిజానికి పట్టణ ప్రాంతాలు తక్కువగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో కరోనా తీవ్రత ఈ స్థాయిలో ఉండకూడదు. ఢిల్లీ, ముంబై, కలకత్తా, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో జనసమ్మర్ధత కారణంగా వ్యాప్తి వేగం ఎక్కువగా ఉంటుంది. ఏదో రూపంలో వ్యాపించి,ప్రజలను కబళిస్తుంది. కానీ 65 శాతం జనాభా గ్రామ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ కంటే అధిక సంఖ్యలో కేసులు నమోదు కావడం స్వయంకృతాపరాధమనే చెప్పాలి. కొన్ని చోట్ల ప్రజలు యంత్రాంగంపై తిరగబడుతున్న వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇవన్నీ పౌరుల్లో లోపించిన క్రమశిక్షణకు అద్దం పడుతున్నాయి. తమ ప్రాణాలకు తామే బాధ్యులం కదా అన్నట్లుగా ప్రజలు ప్రవర్తిస్తు న్నారు. అటువంటి వారే రోగ వాహకులుగా మారుతున్నారు. ప్రాణాలకు మించిన విలువైన అవసరం ఏమీ లేదు. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోతే కరోనా మరిం తగా విజృంభించే అవకాశం కనిపిస్తోంది.తొలి విడత కరోనా విషయంలో చాలా వరకూ కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో వ్యవహరించాయి. లాక్ డౌన్ మొదలు, రవాణా వ్యవస్థ పునరుద్ధ రణ వరకూ ఒక పద్ధతి అమలైంది. కానీ ఇప్పుడు రాష్ట్రాలు తమ ప్రత్యేక విదానాలను అమలు చేస్తున్నాయి. దీనిపై భిన్నమైన అభిప్రాయాలున్నాయి. ఆయా రాష్ట్రాల్లో పరిస్థితులను బట్టి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం ఉత్తమమనే వాదన ఒకటి. రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థంగా వ్యవహరించలేకపోతున్నాయి. కాబట్టి కేంద్రమే విదివిధానాలను కఠినంగా అమలు చేయాలనేది మరొక వాదన. నిర్ణయం ఏకాభిప్రాయం తో తీసుకుంటున్నారా? రాష్ట్రాలు స్వయం ఆదేశాలు జారీ చేస్తున్నాయా? అన్నది పక్కన పెడదాం. కరోనా కట్టడిలోనూ రాజకీయాలు చోటు చేసుకోవడం చర్చకు తావిస్తోంది. అన్నీ తానే చేస్తున్నాను అన్నట్లుగా చాటుకో వాలని కేంద్రం చూస్తోంది. కేంద్రాన్ని తప్పుపట్టడమే లక్ష్యంగా మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్ వంటి ప్రభుత్వాలు ప్రయత్నిస్తు న్నా యి. ప్రజల ప్రాణాలతో ముడిపడిన అంశాల్లోనూ రాజకీయా లు చోటు చేసుకోవడం దురదృష్టకరం. కొన్ని చోట్ల ప్రాణావస రమైన మందులు బీజేపీ కార్యాలయాల్లో నిల్వ చేస్తున్నారనే వార్తలు వచ్చాయి. వాటిని తమకు నచ్చిన ఆసుపత్రులకు, రోగులకు ఇస్తున్నారనేది ప్రచారం. ఇది బీజేపీకి చెడ్డ పేరు తెచ్చే వ్యవహారమే. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఉండే సున్నితమైన వ్యత్యాసాన్ని గుర్తించ నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధం.కరోనా విషయంలో ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు న్యాయస్థా నాలు కృషి చేయాలి. ఉపాధికి భంగం రాకుండా ప్రభుత్వాలకు ఆదేశాలివ్వాలి. అదే సమయంలో ఒకవేళ ప్రభుత్వాల చర్యల ద్వారా ప్రజల ఆహారభద్రతకు, వృత్తికి భంగం వాటిల్లితే పరిహారం చెల్లింపు బాధ్యతను గుర్తు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేయకపోయినా వారికి వేతనాలు చెల్లిస్తున్నారు. అసంఘటిత రంగంలోని కోట్ల మంది పరిస్థితి ఏమిటి? వారికి ఏరకంగా ప్రభుత్వాలు చేయూతనివ్వా లనే అంశంపై న్యాయస్థానాల సూచనలుఅవసరం. ముఖ్యం గాప్రజారోగ్యాన్నికార్పొరేట్ , ప్రయివే టు ఆసుపత్రులు నగదు గా మార్చుకుంటున్నాయి. చట్టాలు,ని యమాలు ఉన్నప్పటికీ ప్రభుత్వంలోని పెద్దలు కార్పొరేట్ ఆసుపత్రుల పట్ల ఉదాసీనంగా ఉంటున్నారు. వీటిపై కొరడా ఝుళిపించాల్సిన బాధ్యతను న్యాయస్థానాలే తీసుకోవాలి. సాధారణమైన సమ్మెలు, సినిమా టిక్కెట్ల రేట్ల వంటి విషయాల్లో న్యాయస్థానాలు రోజులతరబడి తమ సమయాన్ని వెచ్చిస్తున్న ఉదంతాలు చూస్తున్నాం. కీలకమైన ప్రజారోగ్యం విషయంలో ఎప్పటికప్పు డు నిఘా ఉందనే బావనను ఆసుపత్రులకు కల్పించాలి. ప్రయివేటు ఆసుపత్రులు వసూలు చేస్తున్న ఫీజుల విషయమై న్యాయస్థానాలు ప్రభుత్వం నుంచి నివేదికలు తెప్పించుకోవాలి. అవసరమైతే సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ లతో కూడిన ప్రత్యేక బృందాలను నియమించి ఆసుపత్రుల్లో ఫీజులను నియంత్రిం చాలి. ఇప్పుడు అంతకుమించిన అత్యవసర బాధ్యతలేమీ ప్రభుత్వానికి లేవు. ఈ దిశలో న్యాయస్థానాలు స్పందించాలి. ప్రాణాలతో పాటు ఆర్థిక దోపిడీ నుంచి పౌరులను కాపాడాలి.

## కరోనాకు కాలుష్యం..కలుస్తోంది....

హైదరాబాద్, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) కరోనా సెకండ్ వేవ్ అత్యంత వేగంగా విజృంభిస్తోంది.. కుటుంబంలో ఒక్కరికి వచ్చినా.. వారిని గుర్తించేలోపే కుటుంబ సభ్యులందరికీ దాదాపుగా వస్తుంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ స్వీయ నిర్బంధం పాటించాలి.. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ కూడా రోడ్డు మీదకు రావద్దు".. ఇటీవల రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు చెప్పిన మాటలివి. నగర ప్రజలు మాత్రం ఇంతటి అమూల్యమైన మాటలను విస్మరిస్తున్నారనేందుకు పీసీబీ తాజాగా విడుదల చేసిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నివేదిక స్పష్టం చేస్తుంది. నగరంలో ఈ నెల 16 వరకు పీసీబీ వాయుకాలుష్య తీవ్రతను, ఏఏ కారణాలతో ఎక్కువగా వాయుకాలుష్యం వస్తుందనే అంశాలపై సుమారు ఆరు స్టేషన్ల ద్వారా నమోదు చేసింది. ఇందులో ఒక్క పాశమైలారం, బొల్లారం మినహా మిగిలిన నాలుగు స్టేషన్లలో వాహన రద్దీ/వాహనాల నుంచే అత్యధిక కాలుష్యం వెలువడినట్లు పీసీబీ తన నివేదికలో పేర్కొంది. కొందరు అనవసరంగా రోడ్లపైకి వస్తుండటంతోనే ఈ వాయు కాలుష్యం పెరుగుతున్నదని.. దీని ద్వారా కరోనా వైరస్ మనుషుల ముక్కు రంధ్రాల ద్వారా నేరుగా ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని.. ఇది చాలా ప్రమాదకరమని అధికారులు పేర్కొన్నారు. నగరంలో కాలుష్యం నమోదు కేంద్రాలు సుమారు ఆరు ఉన్నాయి. వీటిని హెచ్‌సీయూ, సనత్‌నగర్, జూపార్కు, పాశమైలారం, బొల్లారం, ఇక్రిశాట్ ప్రాంతాల్లో పీసీబీ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే పీసీబీ విడుదల చేసిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో ఒక్క పాశమైలారం ప్రాంతంలో మాత్రం పరిశ్రమల నుంచి ఎక్కువగా కాలుష్యం వెలువడుతున్నట్లు నివేదికలో పేర్కొనగా, బొల్లారంలో మాత్రం ఘాటు వాసనలతో కూడిన దుర్వాసనలు వెలువడుతున్నట్లు పీసీబీ జాబితాలో పేర్కొన్నారు. మిగిలిన నాలుగు (హెచ్‌సీయూ, సనత్‌నగర్, జూపార్కు, ఇక్రిశాట్) ప్రాంతాల్లోని కేంద్రాల పరిధిలో ఎక్కువగా వాహనాలు/వాహనాల రద్దీతోనే వాయుకాలుష్యం పెరుగుతున్నట్లు పీసీబీ జారీ చేసిన నివేదికలో పేర్కొన్నారు.ప్రస్తుతం కరోనా సెకండ్ వేవ్ తీవ్రరూపం దాల్చడంతో నగరంలోని పలు ఐటీ, ప్రైవేటు కంపెనీలు ఉద్యోగులకు ఇప్పటికే వర్క్‌ఫ్రం హోం ఇచ్చారు. సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలతో పాటు ఎంఎన్‌సీ కంపెనీలు కూ డా కార్మికులకు షిఫ్ట్‌ల ప్రకారం విధులు అప్పగించారు. ఈ క్రమంలో నగరంలో ప్రస్తుతం వాహనాల రద్దీతో పాటు వాహన కాలుష్యం తగ్గాలి. అయితే.. వాహన రద్దీతో పాటు వాహన కాలుష్యం క్రమంగా పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ మధ్య కళాశాలలు లేని కారణం గా అవసరం ఉన్నా.. లేకున్నా.. యువత స్నేహితులతో కలిసి సరదాగా రోడ్లపై తిరిగేవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని, ఈ క్రమంలోనే నగరంలో ఉద్యోగాలు చేసేవారి కంటే ఎక్కువగా యువ త వాహనాలే రోడ్లపై చక్కర్లు కొడుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ వాహనాలతో వాయు కాలుష్యం పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.ప్రస్తుతం నగరంలో చిన్న చిన్న దుమ్ము, ధూళి కణాలు ఎక్కువగా ఉన్నట్లు పీసీబీ విడుదల చేసిన ఏక్యూఐ (ఎయిర్ కర్వాలిటీ ఇండెక్స్)లో పేర్కొన్నారు.నగరంలో పీఎం10, పీఎం 2.5 కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.అత్యధికంగా పాశమైలారంలో సాధారణ స్థాయిని మించి (128ఐ/ఎ3), జూపార్కు ప్రాంతంలో సాధారణ స్థాయిని మించి (102 ఐ/ఎ3) ఉన్నాయి.ఇలాంటి కాలుష్యం మనుషుల ముక్కుల ద్వారా నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరుతుందని పీసీబీ సైంటిస్టులు పేర్కొంటున్నారు.అలాగే ఆ దుమ్ము కణాల్లో కంటికి కనిపించని కరోనా ఉన్నా.. అది నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరే అవకాశం ఉందని,ఇదిచాలా తీవ్రమైన విషయమని అధికారులు పేర్కొంటున్నా రు.అలాగే వాహనాలపొగగొట్టాల ద్వారా వెలువడే దుమ్ము, ధూళితో ఎక్కువ ప్రమాదమని అధికారులు పేర్కొంటున్నారు. సాధారణ స్థాయిని మించి వాయుకాలుష్యం వెలువడటం వల్ల శ్వాస సంబంధ వ్యాధులతో పాటు గుండె సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

## సెనగకు గిట్టుబాటు ధరేది




ఒంగోలు, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) శనగ ధరలు ఈ ఏడాది కూడా భారీగా పడిపోతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కన్నా తక్కువకు పడిపోతున్నాయి. శనగను 80 శాతం వ్యాపారులే కొంటారు. కొంత వరకూ మాత్రమే ప్రభుత్వ సంస్థలైన మార్క్‌ఫెడ్ లాంటివి సేకరిస్తాయి. వ్యాపారులపై ఆధారపడడం వల్ల ధరల నిర్ణయం వారి చేతుల్లోనే ఉంటోంది. ఉత్తరాది రాష్ట్రాలకు ఇక్కడి నుంచి శనగ ఎగుమతి అవుతుంది. అక్కడ వ్యాపారులు సహజంగా కోల్డ్ స్టోరేజీలకు వచ్చి కొంటారు. అవి చిన్నకారు రైతులకు అందుబాటులో ఉండవు. పొలాల్లో నూర్పిడి రోజునే అమ్ముకోవాల్సివస్తోంది. దీంతో, వ్యాపారులు మరింత తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.శనగ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.5,120గా ప్రభుత్వం ప్రకటించింది. వ్యాపారులు ఈ ధరకు కూడా కొనడం లేదు. శనగ మార్కెట్ ఆరంభంలోనే ధరలు తగ్గించేశారు. క్వింటాలుకు రూ.4,200 నుంచి రూ.4,500 మించి ఇవ్వడం లేదు. ఎంఎస్‌పి కంటే క్వింటాలు ఒక్కంటికీ రూ.920 నుంచి రూ.620 వరకూ రైతులకు తక్కువగా వస్తోంది. గతంలో క్వింటాలు శనగలు రూ.10 వేలు వరకూ అమ్ముడుపోయాయి. ఈ ఏడాది అకాల వర్షాల వల్ల ఎకరాకు కనీసం రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకూ దిగుబడి తగ్గింది. ఇటు దిగుబడి తగ్గి, అటు ధర అందక రైతులు నష్టాల పాలౌతున్నారు.జిల్లాలో ఇంకొల్లు, పంగులూరు మండలాల్లో ఏర్పాటైన మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాల్లో ఇంతవరకు 650 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో, ప్రయివేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో శనగ సాగైంది. ఎకరాకు సగటున 8 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. జిల్లాలో 12 లక్షల క్వింటాళ్లు దిగుబడి వచ్చినట్లు అంచనా. అకాల వర్షాల వల్ల కొంత నష్టం జరిగింది. మార్క్‌ఫెడ్ కనీసం మూడు లక్షల క్వింటాళ్లు సేకరించినా పోటీ ఏర్పడుతుంది. వ్యాపారులు కూడా కనీస మద్దతు ధర ఇస్తారు. అయితే, సొసైటీలు కొనుగోలు చేసి మార్క్‌ఫెడ్‌కు ఇవ్వాలి. రైతులకు సొసైటీలు చెల్లింపులు చేస్తాయి. ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. మార్క్‌ఫెడ్ అధికారులు, సొసైటీల మధ్య చర్చలు, ఒప్పందాలు జరుగుతున్నాయి. ఇవి కొలిక్కి వస్తేనే కొనుగోళ్లు చేస్తారని సమాచారం.

## కరోనా వ్యాక్సిన్ సక్సెస్ ఫుల్ గా పని



ముంబై, ఏప్రిల్ 22, ) కోవిడ్ టీకా తీసుకున్న తరువాత కొందరు చనిపోతున్న విషాదకర వార్తలతో అనేక భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో వ్యాక్సిన్ తీసుకునేందుకు చాలా మంది వెనకాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఐసిఎంఆర్ సంచలన డేటా విడుదల చేసింది.కోవాక్సిన్ రెండు మోతాదులు తీసుకున్న వారిలో దాదాపు 0.04 శాతం మంది మాత్రమే కోవిడ్ –19 కు పాజిటివ్ సోకినట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. అలాగే కోవిషీల్డ్ యొక్క రెండు మోతాదులు తీసుకున్న తర్వాత 0.03 శాతం మందికి పాజిటివ్ అని తేలింది. సంక్రమణ పురోగతిపై ఈ డేటాను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) విడుదల చేసింది. అంటే కరోనా వ్యాక్సిన్ వేసిన తరువాత ప్రజలు వ్యాధి బారిన పడుతున్నప్పటికీ వ్యాధి తీవ్రంకాకుండా నిరోధిస్తుందని ఐసీఎంఆర్ డేటా తేల్చింది.ప్రతి 10 వేల మందిలో సగటున కేవలం నలుగురు, కొవిషీల్డ్ తీసుకున్న వారిలో కేవలం ముగ్గురు మాత్రమే కరోనా బారిన పడినట్లు బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.మొత్తంగా చూస్తే కొవాగ్జిన్ రెండు డోసులు తీసుకున్న మొత్తం 17,37,178 మందిలో కేవలం 695 మంది (0.04 శాతం) మాత్రమే కొవిడ్ బారిన పడ్డారు. ఇక కొవిషీల్డ్ తీసుఉన్న మొత్తం 1,57,32,754 మందిలో కేవలం 5,014 మందికి మాత్రమే కరోనా సోకినట్లు ఈ డేటా తేల్చింది. వ్యాక్సిన్ సామర్థ్యంపై సందేహాలు వ్యక్తం చేస్తున్న వారికి ఈ గణాంకాలే సమాధానం చెబుతున్నాయి.ఓవరాల్‌గా తీవ్రమైన అనారోగ్యం విషయానికి వస్తే ఇండియాలో ఉపయోగిస్తున్న వ్యాక్సిన్‌లు వంద శాతం సమర్థంగా పని చేస్తున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. సెకండ్ వేవ్ దేశాన్ని చుట్టుముట్టిన ఈ సమయంలో ఇవి ఊరట కలిగించేవే.ఇక కేవలం ఒకే డోసు తీసుకున్న వాళ్లలో కరోనా బారిన పడిన వాళ్ల సంఖ్యను కూడా ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు కొవాగ్జిన్ ఒక డోసు తీసుకున్న వాళ్ల సంఖ్య 93,56,436 కాగా.. అందులో 4208 మంది (0.04 శాతం) కరోనా బారిన పడ్డారు. ఇక కొవిషీల్డ్ ఫస్ట్ డోసును 10,03,02,745 మంది తీసుకోగా.. వారిలో 17,145 మంది(0.02 శాతం)కి కరోనా సోకింది.

## ఆక్సిజన్ ఉత్పత్తి లో ముందున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్

### విశాఖ స్టీల్ ప్లాంట్ లో రోజుకి 150 టన్నుల మేర ఆక్సిజన్ను ఉత్పత్తి

విశాఖపట్నం రాష్ట్రానికే తలమానికంలా ఉంటూ వచ్చిన విశాఖ ఉక్కు కర్మాగారం పేరును వాడుకున్నాయి అన్ని పార్టీలు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ సర్కార్ ప్రతిపాదించిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వ్యవహా రంపై రోజుల తరబడి రచ్చ సాగింది. అలాంటి విశాఖ ఉక్కు కర్మాగారం.. ఇప్పుడు దేశం మొత్తాన్నీ ఆదుకునే స్థాయికి చేరింది.దేశం మొత్తానికీ ఆక్సిజన్ సరఫరా చేసే అన్నపూర్ణలా మారింది. కరోనా వైరస్ భయానకంగా వ్యాప్తి చెందుతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఆక్సిజన్ కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. అన్ని రాష్ట్రాలూ ఈ సమస్యను ఎదుర్కొంటోన్నాయి. ప్రత్యేకించి– కరోనా పాజిటివ్ కేసులు వేల సంఖ్యలో పుట్టుకొస్తోన్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్లల్లో ఆక్సిజన్ కొరత తీవ్రంగా ఉంది. కరోనా బారిన పడిన పేషెంట్లకు అందించడానికి చాలినంత ఆక్సిజన్ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండట్లేదు.ఈ పరిణామాల మధ్య.. ఆక్సిజన్ ఉత్పత్తిని చేపట్టింది విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీ. టన్నుల కొద్దీ మెడికల్ ఆక్సిజన్ను ఉత్పత్తి చేస్తోంది. ఆక్సిజన్ కొరత ఏర్పడిన రాష్ట్రాలకు తరలించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంది. నవీ ముంబైలోని కలంబోలీ గూడ్స్ యార్డ్ నుంచి ఏడు ఖాళీ ట్యాంకర్లతో కూడిన ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ విశాఖకు చేరుకుంది.విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీలో లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ను నింపుకొని మళ్లీ.. తిరుగుప్రయా ణమౌతుంది. ఈ రకం ఆక్సిజన్ తయారీలో విశాఖ స్టీల్ ప్లాంట్ అగ్రగామిగా కొనసాగుతోంది. కరోనా బారిన పడిన పేషెంట్ల ప్రాణాలను కాపాడటంలో కీలకమైన మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తిలో గత ఏడాది ఈ స్టీల్ ప్లాంట్ కీలకపాత్ర పోషించింది. గత ఏడాది ఈ స్టీల్ప్లాంట్ నుంచి పలు రాష్ట్రాలకు ఆక్సిజన్ సరఫరా అయింది. అప్పట్లో ఇప్పుడున్నంత డిమాండ్ ఏర్పడలేదు. ఈ సారి మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు దేశంలో నెలకొని ఉన్నాయి. గత ఏడాది గరిష్ఠ సంఖ్యతో పోల్చుకుంటే రెండు రెట్లు అధికంగా కరోనా కేసులు రికార్డవుతున్నాయి.విశాఖ స్టీల్ప్లాం ట్లో ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ ఆక్సిజన్ తయారీ యూనిట్ ఉంది. దీనిలో తయారైన ఆక్సిజన్లో కొంత భాగాన్ని బయటి అవసరాల కోసం కేటాయిస్తుంటారు. సొంత అవసరాల కోసం వినియోగించడమే అధికం. కేంద్రం ఆదేశాలతో విశాఖ స్టీల్ ప్లాంట్ తన ఆక్సిజన్ ఉత్పత్తిని పెంచింది. రోజుకు 150 టన్నుల మేర ఆక్సిజన్ను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశంలో మిగిలిన స్టీల్ ప్లాంట్లు కూడా ఆక్సిజన్ ఉత్పత్తిని పెంచడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. రానున్న రోజుల్లో ఆక్సిజన్ కొరత లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంది.

## హర్యానా లోహాస్పిటల్ పీపీసీ సెంటర్ నుంచి 1,710 కొవిడ్ వ్యాక్సిన్ చోరీ

హర్యానా ఏప్రిల్ 22 కోవిడ్ మహమ్మారికి కట్టుకట్ట వేసేందుకు వ్యాక్సినేషన్ కీలకంగా మారింది. కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాయి. ఈ క్రమంలో అక్రమార్కుల కన్ను వ్యాక్సిన్లపై పడింది. ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన చోరీ ఘటన మరిచిపోక ముందే మరోసారి హర్యానాలో టీకాల దొంగతనం కలకలం సృష్టిస్తున్నది.జింద్ జిల్లాలోని సివిల్ హాస్పిటల్‌లోని పీపీసీ సెంటర్ నుంచి 1,710 మోతాదుల కొవిడ్ వ్యాక్సిన్ చోరీకి గురైనట్లు అధికారులు గురువారం పేర్కొన్నారు. 1,270 కొవిషీల్డ్ డోసులు, 440 డోసుల కొవాగ్జిన్ పీపీసీ సెంటర్ నుంచి చోరీకి గురయ్యాయని, అలాగే కొన్ని ముఖ్యమైనఫైల్స్‌నుసైతంగుర్తుతెలియని వ్యక్తులు దొంగిలిం చారని ఓ అధికారి తెలిపారు. సెంటర్ ఇన్‌చార్జి మాట్లాడుతూ మొత్తం జిల్లాకు సరఫరా చేసే వ్యాక్సిన్ ప్రధాన కేంద్రాన్ని తనిఖీ చేస్తామని, ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని, టీకాల మాయంపై విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

## మంత్రి వర్గ ఉప సంఘం భేటీ

అమరావతి(విశ్వం వాయిస్ న్యూస్) సెకండ్ వేవ్లో ఆంధ్రప్రదేశ్లో కరోనా మహమ్మారి తన ప్రతాపం చూపిస్తోంది. రోజురోజుకూ ఇటు వైరస్బారిన పడుతున్నవారితో పాటు మరణాల సంఖ్య సైతం క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై సమీక్షించేందుకు మంత్రివర్గ ఉససంఘం భేటీ అయ్యింది. మంత్రి ఆళ్ల నాని సారథ్యంలో రాష్ట్రంలో కొవిడ్ నివారణ, పర్యవేక్షణ, వ్యాక్సినేషన్పై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అయ్యింది. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పడకలు, ఆక్సిజన్ లభ్యత, వైద్య నిపుణుల నియామకం తదితర అంశాలపైన, మరియు 10 వ తరగతి ,ఇంటర్ పరీక్షల నిర్వహణ అంశం పైనా.. రాష్ట్రంలో ఆంక్షల విధింపు అంశంపైనా చర్చించినట్లు సమాచారం.

## గోవులపై యాసిడ్ దాడి..

### నిందితులపై కఠిన చర్యకు డిమాండ్

రాజమహేంద్రవరం (విశ్వం వాయిస్ న్యూస్)స్థానిక నారాయణపు రం లో రక్తం ఓడుతున్న గోమాతలను, రాజమాహేంద్రవరం పార్లమెంట్ జిల్లా మాజీ అధ్యక్షులు బర్ల బాబూరావు పరిశీలించి ఈ దుష్ట చర్యలను ఖండించారు. కార్పొరేషన్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని సంఘ విద్రోహ శక్తులు పన్నిన కుట్ర లేక ఏదైనా వ్యాధి కారణమా అన్నది పశు వైద్య అధికారులు, పోలీసులు తెలియజేయాలని, ఎందుకు అంటే రాష్ట్రంలో ఆలయాల మీద దాడులు, ఆలయ రథములు తగలబెట్టడం, విగ్రహాలు ధ్వంసం చేయడం చూసాం వచ్చే రోజుల్లో రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికలు ఉన్న సందర్భంగా ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఎవరైనా కుట్ర చేశారా అని అనుమానం కలుగుతుంది ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి పెట్టి అలాంటి చర్యలు జరిగి ఉంటే సంఘ విద్రోహ శక్తులను ఎంతటి వారైనా కటకటాల వెనక్కి పంపించాలి నోరులేని మూగజీవాలను ఆదుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.. అనంతరం ఘటనకు సంబంధించి కాకినాడకు చెందిన ఒక ప్రత్యేక వెటర్నిటీ వైద్య బృందం వచ్చి గోవులను పరిశీలించి వాటివద్దనుంచి శ్యాంపెల్స్ తీసుకుని దీనిమీద ప్రత్యేక వివరాలు సేకరించి, వివరాలను తెలియజేస్తామని అన్నారు.

## కరోనా పేషంట్ ఉంటే...

హైద్రాబాద్, ఏప్రిల్ 22, (విశ్వం వాయిస్ న్యూస్)ఇది చాలా విపత్కర పరిస్థితి. కరోనా సెంకడ్ వేవ్ ఉధృతి వేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో మీ కుటుంబంలోనే ఎవరైనా వైరస్ బారిన పడితే వారి పట్ల మీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకందాం. సాధరణంగా ఈ కరోనా బారిన పడినప్పుడు పూర్తిగా ఐసోలేషన్‌లో ఉండాలి. కానీ, మన ఇంట్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. మీ భాగస్వామి లేదా మీ పిల్లల్లో ఎవరైనా ఈ మహమ్మారి బారిన పడినపుడు ఒక ఇంట్లో మనం ఉండాల్సి ఉంటుంది. వారికంటూ ప్రత్యేక గదిని కేటాయించలేని పరిస్థితి కూడా ఏర్పాడవచ్చు , పాజిటివ్ వచ్చిన ప్రతిఒక్కరూ ఆస్పత్రిలో జాయిన్ అయ్యే అవసరం ఉండదు. పాజిటివ్ వచ్చినపుడు కంగారు పడకుండా జాగ్రత్తగా ఆలోచించాలి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న సమయంలో భయాందోళనకు గురవ్వడం సాధరణమే.. అయినా కాస్త ప్రశాంతంగా ఆలోచించాలి. మీ ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకుంటూనే, వైరస్ బారిన వారిని కూడా చికిత్స అందించవచ్చు.కొన్ని చేయాల్సిన, చేయకూడని నియమాలు ఏంటో మనం తెలుసుకందాం. దీన్ని డాక్టర్ బెహ్రన్ పార్దివాలా అనే వైద్యుడు ఇచ్చిన సూచనల మేరకు కేర్ గివర్స్‌పై పాటించాల్సిన నియమాలు తెలుసుకుందాం.ఇంట్లో ఉన్న ప్రతిఒక్కరూ మాస్క్ తప్పనిసరిగా వాడాలి. ఎట్టి పరిస్థితుల్లో తీయకూడదు.కరోనా బారిన పడిన వ్యక్తి దుస్తులను విడిగా ఉతకాలి. క్రిమిసంహారక మందుతో శుభ్రం చేయాలి.ఒకవేళ మీ ఇంట్లో ప్రత్యేక టాయిలెట్ సదుపాయం లేకుండా, కామన్ వాష్‌రూం ఉంటే తరచూ క్రిమిసంహారక పిచికారీతో శుభ్రం చేస్తూ ఉండాలి.రోగి వాడిన పడేసిన వస్తువులను ప్రత్యేకమైన పసుపు హజర్డాస్ బాక్స్‌లో వేయాలి.కరోనా బారిన పడిన వ్యక్తి గదిలోకి ఇతన కుటుంబసభ్యులు నేరుగా ప్రవేశించకూడదు.

## టీడీపీకి బెజవాడ పాఠాలు

విజయవాడ, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) ఏపీ టీడీపీకి ఇప్పటికిప్పుడు కావాల్సింది ఏంటి ? ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి టీడీపీ నేర్చుకోవాల్సింది ఏంటి? మరీ ముఖ్యంగా ఎన్నికలకు ముందు విజయవాడలో తలెత్తిన వివాదాలు, నాయకుల వ్యవహారశైలి నేర్పుతున్నది ఏంటి ? అనే విషయాలు చర్చనీయాంశంగా మారాయి. నేతల మధ్య సమన్వయం లేని తనం.. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీలో ఎక్కువగా కనిపిస్తోంది. ఎవరికి వారుగా పెత్తనం చేస్తున్నారు. ఎక్కడికక్కడ గ్రూపు రాజకీయాలు.. వంటివి పార్టీని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నాయి. ఈ కారణంగానే స్థానిక ఎన్నికల్లో పార్టీ పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితి కనిపించింది. మరీముఖ్యంగా బెజవాడ పరిస్థితిని తీసుకుంటే.. గత ఎన్నికల్లో విజయవాడ ఎంపీగా విజయం సాధించిన కేశినేని నాని పార్టీని ముప్పుతిప్పలు పెడుతూ.. దూకుడుగా వ్యవహరించారు. తాను ఒంటరిగా గెలిచానని.. ఆరుగురు ( తన లోక్‌సభ నియోజక వర్గం పరిధిలోకి వచ్చే)ఎమ్మెల్యేలు ఓడిపోయినా.. తాను మాత్రమే గెలిచానని ఏకపక్ష ధోరణితో మాట్లాడి? తనకు తప్ప.. ఇంకెవరికీ ప్రజాదరణ లేదన్నట్టుగా వ్యవహరించారు. అంతేకాదు.. అందరినీ కలుపుకొని వెళ్లాల్సిన ఎన్నికలను ఒంటరిపోరుగా మార్చేందుకు ప్రయత్నించారు.. తనే విజయవాడలో టీడీపీని ముందుకు తీసుకువెళ్లి గెలిపిస్తానని సవాళ్లు రువ్వారు. తీరా ఎన్నికల అనంతరం.. ఏం జరిగిందో తెలిసిందే. ఇక, ఇప్పుడు చూద్దామన్నా? ఎంపీ కేశినేని నాని జాడ కనిపించడం లేదు. ఇక, దిగువ స్థాయి నేతల్లోనూ సమైక్యత లోపించింది. ఓడిపోయిన నాయకులు తమను కొందరు పనిగట్టుకుని ఓడించారని ప్రచారం చేస్తున్నారు. నిజానికి నాయకులకు అంత శక్తి ఉంటే.. ఓడిన వారు సరే.. మరి మిగిలిన వారి పరిస్థితి ఏంటి ? వాళ్లని గెలిపించాలి కదా ? అన్న ప్రశ్నకు ఎవరిదగ్గరా సమాధానం లేదు. ఇలా మొత్తంగా టీడీపీ పరిస్థితి ఎవరికి వారు చక్రాలు తిప్పడం.. ఆధిపత్య రాజకీయాలకు తెరదీయడం వంటివి కనిపిస్తున్నాయి. నిజానికి ఒక పార్టీ డెవలప్ అవ్వాలి అంటే.. అన్ని కులాలు, అందరు వ్యక్తులు కలిస్తేనే సాధ్యమవుతుందనే వాదన అందరికీ తెలిసిందే. కానీ, టీడీపీలో ఈ కీలక సూత్రాన్ని విస్మరిస్తున్నారు. వచ్చే రెండున్నరేళ్లలో పార్టీని ఇలానే వదిలేస్తే.. మరోసారి కూడా పార్టీకి అధికారం దక్కే పరిస్థితి లేకుండా పోతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరి ఇప్పటికైనా పార్టీలో లోపాలను గుర్తించి చర్యలు చేపడతారా? లేక ఇలానే వదిలేస్తారా? అన్నది తేలాల్సి ఉంది

## సింహాచలం కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం

విశాఖపట్నం సింహాచలం శ్రీశ్రీశ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగే కళ్యాణోత్సవానికి సర్వం సిద్ధం అయ్యాయి. స్వామివారికి విశేష అలంకరణ నిమిత్తం వెండి, బంగారం ఆభరణాలు శ్రీవారి భండారము నుంచి అందజేసారు. పూర్వాచారంగా వస్తున్న ఒడిశాలోని బరంపురం నుంచి ప్రత్యేకంగా నేయించిన అహింసా పట్టువస్త్రాలు ఏఈవో ద్వారా పురోహితులు, అలంకారియైన సీతారాం ఆచారి కి అప్పగించారు.

## కరోనాతో నిమిషానికి ఒకరు...మృతి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22, కరోనా సెకండ్ వేవ్ ముంచెత్తుతోంది. లక్షల మందికి సోకుతోంది. రోజూ వందల మంది చనిపోతున్నారు. ఆదివారం నుంచి నిమిషానికి ఒకరు చనిపోతున్నారు. గంటకు 10 వేలకు పైగా కేసులు నమోదవుతున్నాయని హెల్త్ మినిస్ట్రీ డేటా వెల్లడిస్తోంది. రోజురోజుకూ ఈ సంఖ్య పెరుగుతోంది. ఏప్రిల్ 1న గంటకు 3 వేల కేసులు, 19 డెత్స్ నమోదు కాగా.. గంటకు 10,895 కేసులు, 62 మరణాలు రికార్డయ్యాయి. సోమవారం నాటికి గంటకు 11,408 కేసులు, 67 మరణాలు నమోదయ్యాయి. మంగళవారం ఏకంగా గంటకు 73 మంది చనిపోయారు. 2,59,170 కొత్త కేసులు వచ్చాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 1,53,21,089కి పెరిగింది. యాక్టివ్ కేసులు 20 లక్షలు దాటాయి. 24 గంటల వ్యవధిలో 1,761 మంది చనిపోయారు. ఇప్పటిదాకా మొత్తం 1,80,530 మంది మరణించారు. వరుసగా 41వ రోజు కూడా యాక్టివ్ కేసులు పెరిగాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 13.26 శాతానికి చేరగా.. రికవరీ రేటు 85.56 శాతానికి పడిపోయింది. ఇప్పటిదాకా 26,94,14,035 టెస్టులు చేశామని, సోమవారం ఒక్కరోజే 15,19,486 శాంపిల్స్ పరీక్షించామని ఐసీఎంఆర్ చెప్పింది. మహారాష్ట్ర, ఢిల్లీ సహా 10 రాష్ట్రాల్లోనే 77.67 శాతం కొత్త కేసులు నమోదవు తున్నాయి. డైలీ పాజిటివిటీ రేటు పెరుగుతోంది. ప్రస్తుతం 15.99 శాతంగా ఉంది. మహారాష్ట్ర, చత్తీస్?గఢ్, యూపీ, కర్నాటక, కేరళ రాష్ట్రాల్లోనే 62.07% కొత్త కేసులు నమోదవుతున్నాయి. పది రాష్ట్రాల్లోనే 82.74 % కొత్త డెత్స్ రికార్డవుతున్నాయి. మంగళవారం మహారాష్ట్రలో 351 మంది, చత్తీస్?గఢ్?లో 240 మంది చనిపోయారు. ఇప్పటిదాకా 13 కోట్ల వ్యాక్సిన్ డోసుల పంపిణీ పూర్తయింది. మొత్తం డోసుల్లో 60% 8 రాష్ట్రాల్లోనే పంపిణీ జరిగింది.

# కూటమికి కోసం ప్లానింగ్ చేస్తున్నారు

కడప, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) సీఎం రమేష్ కడప జిల్లాలో కీలక నేత. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో కింగ్ గా మెలిగిన నేత. అయితే ఇప్పుడు ఆయన ఎందుకూ పనికిరాకుండా పోయారు. బీజేపీలో ఆయన చెబితే వినే పరిస్థితి లేదు. అయితే సీఎం రమేష్ కు రాజ్యసభ పదవి 2023 వరకూ ఉంది. దీంతో ఆయన కొంత వరకూ ఊపిరి పీల్చుకున్నట్లే. బీజేపీలో కొనసాగితే మళ్లీ రాజ్యసభ పదవి వస్తుందన్న గ్యారంటీ లేదు. అలాగని సీఎం రమేష్ కు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యమూ లేదు. నిజమే.. పారిశ్రామికవేత్తలకు, లాబీయింగ్ చేసేవారికి తెలుగుదేశం పార్టీయే అనుకూలం. ఆ పార్టీలో ఉంటే ఖచ్చితంగా పదవి దక్కుతుందన్న ఆశ ఉంటుంది. కానీ బీజేపీలో అలాంటి అవకాశాలుండవు. అక్కడ క్వాలిఫికేషన్ డబ్బులు కాదు. కేవలం పార్టీ ట్యాగ్ మాత్రమే. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి బీజేపీ రాజ్యసభ పదవి ఇస్తుంది. అంటే ఆ క్వాలిఫికేషన్లు ఏవీ మనోడి దగ్గర లేవు. దీంతో సీఎం రమేష్ కు మరోసారి రాజ్యసభ పదవి బీజేపీ నుంచి అయితే రాదు. ఇక ఆయనకు ఉన్న ఏకైక మార్గం తిరిగి టీడీపీలో చేరడమే. కానీ టీడీపీ పరిస్థితి బాగా లేదు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా నైరాశ్యం కన్పిస్తుంది. వచ్చే ఎన్నికల నాటికి కోలుకుంటుందని చెప్పలేని పరిస్థితి. అయితే సీఎం రమేష్ లో ఒకే ఒక ఆశ. టీడీపీ, బీజేపీ, జనసేన కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాయని. ఇందుకోసం ఆయన ఢిల్లీలో లాబీయింగ్ బాగానే చేస్తున్నారని వినికిడి. వైసీపీ ప్రభుత్వం పై ఎప్పటికప్పుడు కేంద్ర నాయకత్వానికి ఫిర్యాదు చేయడంలోనూ సీఎం రమేష్ ముందుంటున్నారు. పొత్తు కుదిరితేనే తనకు భవిష్యత్ ఉంటుందని సీఎం రమేష్ కు తెలియంది కాదు. ఆ తర్వాత నెమ్మదిగా టీడీపీ నుంచి రాజ్యసభ పదవిని రెన్యువల్ చేయించుకునే వీలుంటుంది. అందుకే ఇప్పుడు సీఎం రమేష్ టాస్క్ అంతా బీజేపీ, టీడీపీలను కలపడమే. సుజనా చౌదరితో కలసి ఆయన ఢిల్లీ పెద్దలను తరచూ కలుస్తూ చంద్రబాబు పట్ల సదభిప్రాయం నెలకొనేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కనీసం జేపీ నడ్డాతోనైనా చంద్రబాబును కలపాలన్న ప్రయత్నంలో సీఎం రమేష్ ఉన్నారని తెలుస్తోంది. మరి ఆయన ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయో చూడాలి.

# సీనియర్లు కాదు... సెకండ్ లీడర్సే కాపాడుతున్నారు

కాకినాడ, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు రాను రాను కష్టాలు తప్పవంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగియడం, పార్టీ పెద్దగా ప్రభావం చూపకపోవడంతో ద్వితీయస్థాయి క్యాడర్ సయితం పార్టీకి దూరమయ్యే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్ లో ఎలాంటి ఎన్నికలు లేవు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, పరిషత్ ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ ప్రభావం ఏమీ లేకపోవడంతో ఎవరూ గెలవలేకపోయారు. పార్టీ నుంచి ఆర్థిక సహకారం లభించకపోయినా పార్టీ కోసం అనేక మంది బరిలో నిలిచారు. సొంత సొమ్ములు వెచ్చించి మరీ పోటీ చేశారు. కానీ అన్నిరకాలుగా వారికి చేదు అనుభవాలే ఎదురయ్యాయి. దీంతో ద్వితీయ శ్రేణి క్యాడర్ కూడా పార్టీకి దూరమవుతారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులే సైలెంట్ అయిపోయారు. పార్టీని పక్కన పెట్టి తమ వ్యాపారాలను చూసుకుంటున్నారు. చంద్రబాబు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. నిజానికి ఈ రెండేళ్ల నుంచి పార్టీని ఒకరకంగా కాపాడింది ద్వితీయ శ్రేణి నేతలే. చంద్రబాబు ఏ పిలుపు ఇచ్చినా కూడా అన్ని మండల కేంద్రాల్లో స్పందించిది ద్వితీయ శ్రేణి నేతలే. స్థానిక సంస్థల ఎన్నికలలో తమకు టిక్కెట్ వస్తుందని, తాము గెలిస్తే రాజకీయంగా ఎదగవచ్చన్న ఆశతో ఈ రెండేళ్లు సెకండ్ లెవల్ క్యాడర్ జెండాను వదలిపెట్టలేదు. ఇక ఇప్పుడు పూర్తిగా క్లారిటీ వచ్చింది. ఇక ఏపదవులు లేవు. మన దరికి వచ్చే అవకాశం లేదని భావించిన ద్వితీయ శ్రేణినేతలు పక్క చూపులు చూస్తున్నారు. చంద్రబాబు తొలి నుంచి నమ్ముకున్నది ద్వితీయ శ్రేణి నేతలనే. వారే పార్టీని కష్టకాలంలోనూ ఆదుకుంటూ వస్తున్నారు. జగన్ ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికలన్నింటీని పూర్తి చేయడం, అందులో టీడీపీ చతికలపడటంతో వారు పునరాలోచనలో పడినట్లు తెలిసింది. ఇప్పటికే అనేక మంది నేతలు వైసీపీ వైపు చూస్తున్నారు. మరో మూడేళ్ల పాటు వైసీపీ అధికారంలో ఉండటం, ఐదేళ్ల పాటు స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడమ ఇందుకు కారణం. దీంతో రాను రాను చంద్రబాబుకు నేతలను కాపాడుకోవడం కష్టంగా మారుతుందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

# రోజాకు ఇంటి పోరు



తిరుపతి, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) వైసీపీ ఫైర్ బ్రాండ్ నాయకురాలు, నగిరి ఎమ్మెల్యే ఆర్కే రోజాపై తాజాగా ఒక సంచలన వీడియో మీడియాలో హల్ చల్ చేసింది. ప్రస్తుతం ఆమె నోరు విప్పితే.. తిట్టిపోస్తున్న, విమర్శలు గుప్పిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబును అత్యంత పతాక స్థాయిలో మెచ్చుకుంటూ.. పొగడ్తల వర్షం కురిపించిన వీడియో కావడంతో వైసీపీ వర్గాల్లో సంచలనం సృష్టించింది. గతంలో టీడీపీలో ఉన్నప్పుడు.. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా రోజా.. చేసిన కామెంట్ల తాలూకు వీడియో ఇది. దీనిలో ఆమె చంద్రబాబును ఆకాశానికి ఎత్తేశారు. అంతన్నారు.. ఇంతన్నారు.. మొత్తానికి చంద్రబాబు వంటి నాయకుడు లేరన్నారు. తెలుగుతల్లి అన్నపూర్ణ వరాలపట్టి.. అమ్మణ్ణమ్మ కలల పంట.. నందమూరి సింహ రాజకీయ వారసుడు, స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త, తెలుగు ఆడపడుచుల ఆత్మీయ సోదరుడు, తెలుగు సింహం, అపర రాజకీయ మేధాదురంధురుడు, పేదల పాలిట పెన్నిధి, తెలుగువారి ఆత్మాభిమానాన్ని ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేసిన కీర్తి వెలుగుల చంద్రుడు.. జగమంతా మెచ్చిన ఆంధ్రుడు, తెలుగు సామ్రాజ్య వీర.. ధీర.. శూర రాజకీయ చక్రవర్తి.. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన ప్రియతమ నాయకుడు మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు" అంటూ రోజా కీర్తించారు. అయితే.. ఇప్పుడు హఠాత్తుగా ఈ వీడియో వెలుగు చూడడం వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిజానికి ఆమె టీడీపీ ని విడిచిపెట్టి పదేళ్లు అయింది. అప్పటి నుంచి ఆమె వైసీపీలో కొనసాగుతున్నారు. పైగా జగన్‌ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఇటీవల తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక విషయంలోనూ ఆస్పత్రిలో ఉండి కూడా వీడియో విడుదల చేసి.. దానిలోనూ చంద్రబాబును తీవ్రస్థాయిలో విమర్శించారు. అలాంటి రోజాకు సంబంధించి ఇప్పుడు విడుదలైన వీడియో.. వెనుక సొంత పార్టీ నేతలే ఉన్నారని.. రోజా వర్గం భావిస్తోంది. నగరిలో రోజాను తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్న కేజే కుమార్ వర్గం ఓ మంత్రి నేతృత్వంలో పనిచేస్తోందని.. వారే తనను డైల్యూట్ చేయాలనే ఉద్దేశంతో పాత వీడియోను సోషల్ మీడియాలో పెట్టారని.. టీడీపీ అనుకూల మీడియా దీనిని మరింత పెద్దది చేసి.. తనకు.. సీఎం జగన్‌కు మధ్య విభేదాలు సృష్టించేందుకు, కేడర్‌లో ఒక గందరగోళాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని.. రోజా అనుచరులు చెబుతున్నారు. ఏదేమైనా.. ఇప్పుడు రోజా వీడియో.. మాత్రం ఆసక్తిగా మారింది. చివరికి దీనిపై ఆమె మీడియా ముందుకు వచ్చి ఏం చెబుతారో చూడాలి

# రేవంత్, కోమటిరెడ్డిలకు లిట్మస్ టెస్ట్

నల్గొండ, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) తెలంగాణ కాంగ్రెస్ కి నాగార్జున సాగర్ ఉప ఎన్నిక చావో రేవో లాంటి సమస్య. దీనికి తోడు? ఇక్కడ ప్రచారం కి వెళ్ళిన నాయకుల మధ్య కూడా ఎవరి బలం ఎంత అనేది కూడా బయట పడుతుంది అంటూ పార్టీ వర్గాల్లో ప్రచారం నడుస్తుంది. జానారెడ్డి గెలవడం ఎంత అవసరమో.. ఇక్కడ తమ పని తీరు చుపించుకోవడం కూడా వాళ్లకు అంతే అవసరం. దీంతో కోమటిరెడ్డి,రేవంత్ ఇద్దరూ పోటీపడి నడిపారు. ఇప్పుడు ఆ ఇద్దరిలో ఎవరి బలం ఎంతో తేలిపోతుంది అంటున్నాయి పార్టీ వర్గాలు. ప్రస్తుత పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పదవి నుండి దిగుతున్న సందర్భంగా సాగర్ ఎన్నికల్లో గెలిపిస్తే అది తన ఖాతాలో పడుతుంది అని ఆశతో ఉన్నారు. అందుకే? తన ప్రయత్నాలు బాగానే చేశారు. ఇక మిగిలిన నాయకుల్లో అటు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,రేవంత్ రెడ్డి వైపు కూడా క్యాడర్ చూస్తుంది. ఎందుకంటే. ఈ ఇద్దరు ఇంఛార్జి లుగా పని చేసిన మండలాల్లో పరిస్థితి ఏంటో తేలిపోతుంది అనే టాక్ నడుస్తుంది. నాగార్జున సాగర్ నియోజకవర్గం లో ఉన్న మండలాల్లో గుర్రంపోడు,పెద్ద వూర కీలకంగా పని చేశయన్నది చర్చ. అయితే గుర్రంపోడు మండల కాంగ్రెస్ బాధ్యతలు చూసింది ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి?పొరుగు మండలం కావడం? అక్కడ కూడా తన పలుకుబడి ఉందని వెంకట్ రెడీ ప్రచారం. పార్టీ కి కూడా ఈ మండలం నుండి? టీఆర్ఎస్ కంటే ఎక్కువ ఓట్లు తెస్తా అని మటిచ్చారట. ఎన్నికల ప్రచారం కూడా..అటు ఉత్తమ్.. కోమటిరెడ్డి కలిసి చేశారు. గుర్రంపోడు మండలం లో జానారెడ్డి కి ఎంత మెజారిటీ



వస్తుంది..అందుకు కోమటిరెడ్డి పడ్డ శ్రమ ఏంటన్నది చర్చ మొదలైంది. ఇతర జిల్లాల నుండి వచ్చిన నాయకులు కూడా కోమటిరెడ్డి సొంత జిల్లా లో హవా ఎంటో బయటపడుతుంది అనే ప్రచారం వినపడింది. ఇక మరో మండలం..పెద్దవురా. ఒకప్పుడు ఇది కాంగ్రెస్ కి కంచుకోట. ఇక్కడ టీఆర్ఎస్ తన ప్రాబల్యం పెంచుకుంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా టీఆర్ఎస్ కె ఎక్కువ. ఇలాంటి మండలం బాధ్యతలు రేవంత్ రెడ్డి ఇంచార్జీ గా పని చేశారు. టీఆర్ఎస్ కూడా ఇక్కడ నుండే ఎక్కువ మెజారిటీ ఆశిస్తుంది. అయితే? రేవంత్ రోడ్ షో ల తో కాంగ్రెస్ కి కొంత ఊపు రావడం క్యాడర్ లో కొంత స్థైర్యాన్ని ఇచ్చింది. అయితే ఇది ఓటు గా ఎంత ట్రాన్స్ఫర్ అయ్యింది అనేది చూడాలి. రేవంత్ ఎన్నికల ప్రచారంలో జానారెడ్డి కి నేను పెద్ద కొడుకునని కొంత జనం లోకి వెళ్లగలిగాడు. కానీ ఇక్కడ ఆశించిన స్థాయిలో ఓట్లు రబట్టిందా.. వన్ వే అనుకున్న ఈ మండలాల్లో టీఆర్ఎస్ ని ఎంత కట్టడి చేశారు రేవంత్ అనేది ఫలితాల్లో తేలిపోతుంది. అయితే రేవంత్ ఎన్నికల ప్రచారం కి తోడు? మండలం లో అన్ని వ్యవహారాలు ఆయనే చక్కబెట్టరాట. సాగర్ ఎన్నికల ఫలితాల మీద జనం కి ఎంత ఆసక్తి ఉందో? ఈ రెండు మండల్లా కాంగ్రెస్ బలం ఏంటన్న దానిపై కాంగ్రెస్ నాయకత్వం కూడా అంతే ఆసక్తితో చూస్తుంది. కోమటిరెడ్డి?రేవంత్..ఇద్దరూ పిసిసి రేసులో ఉన్నవాళ్లే. అందులోనూ కోమటిరెడ్డిది సొంత జిల్లా..పొరుగు నియోజకవర్గం..వీరి బలం ఎంత అనేది మే 2 న తేలిపోతుంది.

## కాణిపాకం ఆలయం దర్శన వేళల కుదింపు

చిత్తూరు ఏప్రిల్ 22 : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తులకు ఉదయం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకే స్వామి వారి దర్శనాన్ని కల్పించనున్నట్లు ఆలయ ఈవో వెంకటేశు తెలిపారు. ఈవో కార్యాలయంలో ఆయన ఆలయంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో స్వామివారి దర్శన వేళల్లో మార్పు చేయనున్నట్లు తెలిపారు. దీనిపై అందరి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అధికారులంతా దర్శన వేళలను కుదించడానికి ఒప్పుకోవడంతో ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉన్న దర్శన వేళలను సాయంత్రం 7 గంటలకు కుదించారు. నిత్య అన్నదానం వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## ఆక్సిజన్ సరఫరా చేస్తున్న స్టీల్ ప్లాంట్

విశాఖపట్టణం, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) విశాఖ స్టీల్‌ప్లాంట్ గొంతునులిమేపని మోడీ ప్రభుత్వం చేస్తున్నా.... కోవిడ్ రోగుల ప్రాణాలు కాపాడే పని ఉద్యోగులు చేస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థగా ఆక్సిజన్ సరఫరాచేసి కోవిడ్ రోగుల ప్రాణాలను కాపాడే బాధ్యతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ కోవిడ్ ఆస్పత్రులకు 100 టన్నులకుపైగా ఆక్సిజన్ సరఫరా చేస్తున్న స్టీల్‌ప్లాంట్, మహారాష్ట్రకు 140 నుంచి 150 టన్నుల ఆక్సిజన్ పంపించేందుకు సిద్ధపడింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి అవసరాలకు తయారుచేసుకున్న లిక్విడ్ ఆక్సిజన్‌ను కోవిడ్ రోగుల ప్రాణాలు నిలబెట్టేందుకు 150 టన్నుల వరకు ఆక్సిజన్‌ను మహారాష్ట్రకు ఇవ్వనుంది. ఆక్సిజన్ తీసుకెళ్లేందుకు 10 ట్యాంకర్లు రాత్రికి స్టీల్‌ప్లాంట్‌కు చేరుకుంటాయని వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు చెబుతున్నారు. దేశంలోని రైల్వే చరిత్రలో రైలుమార్గం గుండా ట్యాంకర్లతో ఆక్సిజన్ పంపించడం ఇదే తొలిసారి అని చెబుతున్నారు. ట్యాంకర్లు వచ్చిన వెంటనే భద్రతను పరిశీలించి ఆక్సిజన్ నింపనున్నారు. కొత్తప్లాంట్లలో ఒక్కో ట్యాంకు ఆక్సిజన్ నింపడానికి గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే అవకాశముంది. బుధవారం ట్యాంకర్లను పంపించనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో ఐదు ఆక్సిజన్ తయారీ యూనిట్లున్నాయి. రోజుకు 500 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తిచేసే సామర్థ్యం కల్గిన యూనిట్లు మూడు, 850 టన్నులు ఉత్పత్తిచేసే సామర్థ్యం కల్గిన యూనిట్లు రెండు వున్నాయి. ఈ ఐదు యూనిట్ల ద్వారా రోజుకు గరిష్టంగా 3,200 టన్నులు ఉత్పత్తి అవుతోంది. దీంట్లో ప్లాంట్ ఉత్పత్తి అవసరాల కోసం 70 శాతం వరకు వినియోగమవుతోంది. మిగిలిన లిక్విడ్ ఆక్సిజన్‌ను ప్లాంట్ రిజర్వులో వుంచుతోంది. కోవిడ్ తీవ్రత పెరగడంతో రోగుల ప్రాణాలు నిలబెట్టేందుకు ఆక్సిజన్ అవసరం పెరిగింది. రాష్ట్రంలోనూ, ఇతర రాష్ట్రాల్లోనూ ఆక్సిజన్ కొరత తీవ్రంగా వుండడంతో తమ శక్తి మేరకు స్టీల్‌ప్లాంట్ ఆక్సిజన్‌ను సరఫరాచేస్తోంది. 2020 మార్చి నుంచి 2021 మార్చి వరకు ఏడాది కాలంలో సుమారు 8,800 టన్నుల ఆక్సిజన్‌ను కెజిహెచ్ సహా రాష్ట్రంలోని కోవిడ్ ఆస్పత్రులకు సరఫరాచేసింది. ఇప్పుడు రాష్ట్రంలోని కోవిడ్ ఆస్పత్రులకు రోజుకు వంద టన్నుల ఆక్సిజన్ అందిస్తున్నది. ఆక్సిజన్ అవసరాన్ని బట్టి రోజుకు 130 టన్నులు సరఫరాచేసిన సందర్భాలులేకపోలేదు.

## 15 ఏళ్లు..పుతిన్

మాస్కో, ఏప్రిల్ 22, (న్యూస్ పల్స్) రష్యా అధ్యక్షుడు పుతిన్ మరింత స్ట్రాంగ్ అయ్యారు ఇటీవల వచ్చిన కొత్త చట్టంతో ఆయన మరో 15 ఏళ్ల పాటు రష్యా అధ్యక్షుడిగా పుతిన్ కొనసాగనున్నారు. అంటే రష్యా అధ్యక్షుడిగా పుతిన్ 2036 వరకూ ఉంటారన్న మాట. ప్రస్తుతంపుతిన్ వయసు 68 ఏళ్లు. అంటే మరో పదిహేనేళ్లు? 83 ఏళ్ల వరకూ ఆయన రష్యా అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఇప్పటికే రష్యాలో పుతిన్ రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్నారు. రాజ్యాంగ నవరణతో పుతిన్ అధ్యక్ష పదవీకాలాన్ని పెంచుకోగలిగారు. గత ఏడాది రష్యాలో రాజ్యాంగ సవరణపై ప్రజాభిప్రాయాన్ని నిర్వహించారు. దాదాపు అత్యధిక శాతం మంది ప్రజలు పుతిన్ ను పదవిలో కొనసాగడానికి మద్దతు పలికారు. రాజ్యంగ సవరణ కు మద్దతుగా దాదాపు 76 శాతం మంది ప్రజలు మద్దతు పలకడంతో రష్యా అధ్యక్షుడిగా పుతిన్ 2036 వరకూ కొనసాగే అవకాశం లభించింది. రష్యా అధ్యక్ష బాధ్యతలను పుతిన్ 2000 సంవత్సరంలో చేపట్టారు. 2008 నాటికి పదవీ కాలం పూర్తయినా తర్వాత ప్రధాని అయ్యారు. అనంతరం రష్యా అధ్యక్షుడి పదవీ కాలాన్ని నాలుగేండ్ల నుంచి ఆరేళ్లకు పెంచారు. 2012లో పుతిన్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇక ఇక్కడి నుంచి పుతిన్ వెనుదిరిగి చూసుకోలేదు. అధ్యక్షుడి పదవీకాలాన్ని పొడిగించే ప్రతిపాదనను సిద్ధం చేసి రాజ్యాంగ సవరణ చేసి తనకు అనుకూలంగామలచుకున్నారునిజానికి పుతిన్ పదవీకాలం 2024లో పూర్తవుతుంది. అయితేరాజ్యాంగసవరణ ద్వారా తనకు అనుకూలంగా మలిచారు. పుతిన్ మరో పదిహేనేళ్ల పాటు అధ్యక్ష పదవిలో ఉండటంతోరష్యామరింతఅభివృద్ధిచెందుతుందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అధ్యక్షుడు తీసుకునే నిర్ణయాలు ఇకపై స్ట్రాంగ్ ఉండబోతున్నాయన్న సంకేతాలు ఇచ్చారు. మొత్తం మీద విపక్షాలను దెబ్బకొడుతూ పుతిన్ రష్యాలో మరింత బలోపేతమయ్యారు.

## నాగర్ కర్నూలు రచ్చ..రచ్చ

మహబూబ్ నగర్, ఏప్రిల్ 22 నాగర్‌కర్నూలు జిల్లా టీఆర్ఎస్ రాజకీయం వేడెక్కింది. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మధ్య ఉన్న ఆధిపత్య పోరు అనూహ్య మలుపు తిరిగింది. టీఆర్ఎస్ లో ఉన్న అంతర్గత పోరు పై స్పందించిన కూచుకుళ్ల ఏకంగా పోలీసులను టార్గెట్ చేశారు. అనుచరులపై పోలీస్ కేసులు పెట్టడంతో ఒక్కసారిగా బరస్ట్ అయ్యారు. స్వపక్షంలో విపక్షంలా ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి గులాబీ గూటిలోకి వెళ్లారు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా కూడా ఉన్నారు. తనను, తన వర్గాన్ని అధికారులు పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం ఎమ్మెల్సీలో ఉందట. టీఆర్ఎస్ కార్యకర్తల్లా పోలీసులు పనిచేస్తున్నారని ఇటీవల కాలంలో వరసగా కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు స్వపక్షానికి చెందిన ఎమ్మెల్సీ కూడా పోలీస్ స్టేషన్లా.. కలెక్షన్ సెంటర్లా తాను పార్టీ మారబోతున్నట్టు జరుగుతున్న ప్రచారం వెనక పోలీసులే ఉన్నారని ఆరోపణలు చేయడం చర్చ గా మారింది. ఎన్నికల వేళ ఎమ్మెల్యే మర్రి..ఎమ్మెల్సీ కూచుకుళ్ల సఖ్యత ఉన్నా.. తర్వాత గ్యాప్ వచ్చిందట. తన వర్గాన్ని మర్రి టార్గెట్ చేసినట్టు దామోదర్‌రెడ్డి ఆగ్రహంతో ఉన్నట్టు చెబుతున్నారు. కాంగ్రెస్‌ను వీడి గులాబీ కండువా కప్పుకొన్న సమయంలో తనతోపాటు వచ్చిన వారందరిపైనా ఎమ్మెల్యే కక్ష సాధిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. చాలా మందిపై పోలీస్ కేసులు నమోదయ్యాయట. నియోజకవర్గంలో ఏ కార్యక్రమం జరిగినా దామోదర్‌రెడ్డిని ఆహ్వానించడం లేదని విమర్శిస్తున్నారు. వీటిన్నింటినీ దృష్టిలో పెట్టుకునే ఎమ్మెల్సీ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారని అభిప్రాయపడుతున్నారు.

# దోపిడీ రహిత సమసమాజ సాధకుడు వి ఐ లెనిన్

## సి ఐ టి యు మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి



కర్నూలు ( విభారె విలేకరి) ఏప్రిల్ 22 :-మార్క్స్ ఎంగెల్స్ శ్రామిక వర్గ సిద్ధాంతాన్ని దోపిడీ రహిత సమాజ సిద్ధాంతాన్ని లెనిన్ రష్యా దేశ పరిస్థితులకు అన్వయించుకుని మార్క్స్ సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా అమలు చేసి ఈ సిద్ధాంతం యొక్క ఔన్నత్యాన్ని ప్రజానీకానికి తెలియజేసి చైతన్యపరిచే 1917లో సాయుధ పోరాటం ద్వారా తొలి దోపిడీ రహిత సమాజాన్ని స్థాపించిన మహా విప్లవ నేత లెనిన్ అని సిఐటియు మాజీ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి సి ఐ టి యు కొనియాడారు. లెనిన్ 151 వ జయంతిని పురస్కరించుకొని సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కార్మిక దర్శక భవన్లో వర్థంతి సభ నిర్వహించారు. ఈ సభకు సిఐటియు మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రష్యా విప్లవం తర్వాత దోపిడీకి గురవుతున్న అనేక దేశాలు సిద్ధాంతాన్ని ఆచరించి దోపిడీ శక్తులకు సాయుధ పోరాటం ద్వారా తిరుగుబాటు చేసి చైనా ,ఉత్తర కొరియా, జకోస్లోవేకియా లాంటి దేశాలు విముక్తిని సాధించి నేడు పురోగమన దిశలో పయనిస్తున్నాయి అని ఆయన తెలియజేశారు. నేడు సామ్రాజ్యవాద దేశాలకు వారి ఆర్థిక దిగ్బంధన లకు కునా రిల్లి పోతున్న దేశాలకు కు మార్క్సిజం లెనినిజం మాత్రమే విముక్తిని కలిగిస్తుంది అని ఆయన తెలియజేశారు. ప్రపంచీకరణ ప్రైవేటీకరణ సరళీకరణ వంటి సామ్రాజ్యవాద దేశాల వ్యాపార దోపిడీలకు అనేక దేశాలు చిక్కుకొని విలవిలలాడుతున్నాయి అని అన్నారు. ఈ పరిస్థితులలో పురోగామి అభివృద్ధి ధర శక్తులు ఏకమై సోషలిజం స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వామపక్ష కార్యకర్తలు మార్క్స్ ,ఎంగెల్స్ లెనిన్ చూపించిన బాటలో ఈ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటి భూతల స్వర్గాన్ని నిర్మించిన వ్యక్తి లెనిన్ మహాశయుడు అని ఆయన తెలిపారు. ప్రపంచంలో దోపిడి రహిత సమాజాన్ని స్త్రీ పురుషుల సమాన హక్కులు కలిగించే సమాజాన్ని నిర్మించిన మొదటి వ్యక్తి వి ఐ లెనిన్ అని ఆయన కొనియాడారు. వి ఐ లెనిన్ చెప్పిన మార్గంలోనే భారతదేశంలో కూడా వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి కార్మికుడు ప్రతి ఒక్కరూ అంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఈ. పుల్లారెడ్డి గోపాల్ అంజి బాబు, విజయ్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా రాతిదూలం పోటీలు

## ఉత్సాహంగా పాల్గొన్న రైతులు.

తుగ్గలి ప్రతినిధి: మండల కేంద్రమైన తుగ్గలిలో శ్రీ రామ నవమి పండుగను పురస్కరించుకొని కీర్తిశేషులు తుగ్గలి ప్రతాప రెడ్డి,తుగ్గలి ప్రహ్లాద రెడ్డి జ్ఞాపకార్థం వారి సోదరులు తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి,కుమారులు తుగ్గలి మోహన్ రెడ్డి,తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి రాతిదూలం పోటీలను నిర్వహించారు.గురువారం రోజున తుగ్గలిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణంలో రాతిదూలం పోటీలను వైసిపి నాయకులు శ్రీనివాసరెడ్డి పూజలు నిర్వహించి రాతిదూలం పోటీలను ప్రారంభించారు.రసవత్తరంగా జరిగిన రాతి దూలం పోటీలలో రైతులు గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.గెలుపొందిన మొదటి విజేతకు వైఎస్సార్సీపీ నాయకులు తుగ్గలి ప్రతాప్ రెడ్డి,తుగ్గలి ప్రహ్లాద రెడ్డి వారి జ్ఞాపకార్థం వారి కుమారులు తుగ్గలి మోహన్ రెడ్డి,తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి లు మొదటి బహుమతి 6000 రూపాయలు బాల తిమ్మయ్య కు అందజేశారు. అదేవిధంగా గెలుపొందిన రెండో విజేతకు టీ.చిన్నా రెడ్డి,గిరిగెట్ల విష్ణువర్ధన్ రెడ్డి లు ఈశ్వరయ్య కు 4000 రూపాయలు అందజేశారు.అదేవిధంగా గెలుపొందిన మూడో విజేతకు రవి శర్మ 2000 రూపాయలు మూడో ఈడిగ రాముడు కు అందజేశారు.చివరగానాలుగో బహుమతిను వడ్డే గంగాధర్ 1000 రూపాయలు మనోహర్ కు అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పల్లెటూరిలో మంచి వాతావరణం ఏర్పడుతుందని,ముందు ముందు మరెన్నో ఇలాంటి కార్యక్రమాలు జరుపుతామని వారు తెలియజేశారు. రాతిదూలం పోటీలను విజయవంతం చేసినందుకు గ్రామ ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ రెడ్డి,దామోదర్ రెడ్డి,రవి శర్మ,చెన్నా రెడ్డి సుధాకర్ రెడ్డి,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



# కరోనా వ్యాక్సినేషన్ పై అపోహలు తొలగించండి

## నూతన సర్పంచులకు మండల ఇంచార్జ్ మురళీ మోహన్ రెడ్డి పిలుపు

. కోసిగి ( విభారె విలేకరి) :గ్రామీణ ప్రాంతాల్లో కరోనా వైరస్ గూర్చి విస్తృతంగా ప్రచారం చేసి,అందరూ వ్యాక్సిన్ వేసుకునేలా చూడాలని,తమతమ గ్రామాలను కరోనా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను మండల ఇంచార్జ్ మురళీ మోహన్ రెడ్డి కోరారు.యునిసెఫ్,ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ మరియు పంచాయతీ రాజ్ శాఖ అద్వర్యంలో కరోనా వ్యాక్సినేషన్ పక్రియపై కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచులకు, వార్డు మెంబర్లకు మరియు వాలింటర్లకు గురువారం స్థానిక మండల సమావేశ భవనం నందు యంపీడిఓ సూర్య నరసింహారెడ్డి అద్వర్యంలో ఏర్పాటు చేసిన అన్ లైన్ శిక్షణ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యంపీడిఓ ఆఫీసు,స్త్రీశక్తి భవనం మరియు పంచాయతీ కార్యలయంలో



దాదాపు 150 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆరడుగుల దూరం పాటిస్తూ, శానిటైజర్ తో తరుచూ చేతులను శుభ్ర పరుస్తూ, ముఖంకు మాస్కు ధరిస్తూ, అవసరమైతే తప్ప బయటకు రాకుడదని కరోనా సెకండ్ వేవ్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఏఓ రమా దేవి,ఈఓ సత్యన్న,సర్పంచు లు,వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పత్తికొండ చాలెంజర్స్

## విజేతలకు నగదు బహుమతులను అందజేసిన తుగ్గలి నాగేంద్ర

.తుగ్గలి ప్రతినిధి: శ్రీ రామ నవమి పండుగ సందర్భంగా మండల కేంద్రమైన తుగ్గలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది.గురువారం రోజున పత్తికొండ చాలెంజర్ మరియు పులిచర్ల జట్ల మధ్య తుది పోరు జరిగింది.పోటాపోటీగా జరిగిన తుది పోరులో పత్తికొండ ఛాలెంజర్స్ విజేతలుగా నిలిచారు.తుది పోరు సమరానికి శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన పత్తికొండ చాలెంజర్స్



జట్టుకు మొదటి బహుమతి గా 30000 రూపాయలను,రెండవ బహుమతిగా పులిచర్ల జట్టుకు 15000 రూపాయలను తుగ్గలి నాగేంద్ర అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా యువకులలో మానసిక ఉల్లాసం,ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని తెలియజేశారు.క్రీడలలో గెలుపోటములు సహజమని,క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, సర్పంచ్ రామాంజనేయులు,పరుశురాం, ఇస్మాయిల్,టోర్నమెంట్ ఆర్గనైజర్లు మల్లి,లక్ష్మీ నారాయణ,నంద కిషోర్,అంపైర్లు మోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## 47 వ డివిజన్ లో చలివేంద్రం ఏర్పాటు చేసిన విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు.

నెల్లూరు ,( విభారె విలేకరి) . నెల్లూరు నగర 47 వ డివిజన్ వైఎస్ఆర్ సీపీ నాయకులు, నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఖజానా వెంకటశేషయ్య ఆచారి ఆధ్వర్యంలో కోటమిట్ట మహాలక్ష్మి గుడి సెంటర్ దగ్గర మజ్జిగ చలివేంద్రం, మంచి నీటి చలివేంద్రం గురువారం ఏర్పాటు చేసి ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి విచ్చేయుచున్న ప్రజలకు రోజురోజుకీ పెరుగుతున్న వేసవి తాపానికి దాహార్తిని తీర్చేందుకు వారం రోజుల పాటు మజ్జిగ చలివేంద్రం ఉంటుందన్నారు. అనంతరం అందులో భాగంగానే ఈ వేసవి కాలం అంతా మంచి నీటి చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంచినీటి చలివేంద్రంలో చల్లటి మంచినీళ్ళు 24 గంటలు అందే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. మానవసేవయే మాధవ సేవ అన్న చందంగా, సాటి మనుషులకు వేసవి తాపం తీర్చేందుకు తన వంతు బాధ్యతగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో 47 వ డివిజన్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు మరియు విశ్వబ్రాహ్మణ జిల్లా సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీకే బ్రాండ్ దిశా పటానీకే రఫ్ పోటీ ఎదురైందిగా

అందాన్ని అందంగా ప్రదర్శించడం ఒక ఎత్తుగడ. అది కొందరికి వ్యసనం. ఇటీవల సోషల్ మీడియాల్లో స్పీడ్ గా ఉన్న భామల్లో సౌందర్య శర్మ ఒకరు. దిల్లీ కి చెందిన డాక్టర్ల కుటుంబం నుంచి వచ్చిన ఈ భామ నటిగా ఎదిగేందుకు చేయని ప్రయత్నం లేదు. ఓవైపు మోడల్ గా రాణిస్తూనే మరోవైపు కథానాయికగానూ పెద్ద ప్లాన్ తో దూసుకెళుతోంది.ఇటీవల సందర్భం ఏదైనా కానీ సౌందర్య శర్మ కాన్సెప్ట్ ఫోటోషూట్లు అంతర్జాలాన్ని షేక్ చేస్తున్నాయి. తాజాగా మరో కొత్త ఫోటోషూట్ తో అంతర్జాలంలో దుమారం రేపుతోంది. ఈసారి ప్రఖ్యాత బ్రాండ్ ఎంపిరియా ఆర్మనీ లోదుస్తులకు సౌందర్య శర్మ బ్రాండ్ అంబాసిడర్ గా ప్రమోషన్ చేస్తోంది. అందుకు సంబంధించిన ఫోటోగ్రాఫ్ ని ఇన్ స్టా వేదికగా షేర్ చేసింది ఈ బ్యూటీ. ఇన్నర్ ధరించి అందాల ఆరబోతతో అమాంతం హీట్ పెంచింది. అన్నట్టు సీకే బ్యూటీ దిశా పటానీకే సౌందర్య రఫ్ కాంపిటీటర్ గా మారుతోందని దీనిని బట్టి అర్థమవుతోంది.సౌందర్య శర్మ సహజంగానే ఫిట్నెస్ ఫ్రీక్. విభిన్నమైన ఫిట్ లుక్ లో తనని తాను ఎలివేట్ చేసుకునేందుకు ఆసక్తిగా ఉంటుంది. ఇక ఈ భామ నిరంతరం జిమ్మింగ్- యోగా - మిక్స్ డ్ మార్షల్ ఆర్ట్స్ విద్యలోనూ రాటుదేలుతోందట.తన ఫిట్ నెస్ రహస్యాన్ని సౌందర్య ఇటీవల వెల్లడించారు. " ఫిట్నెస్ అనేది నటీమణులకు చాలా ముఖ్యం. అది కూడా చిన్న వయసు నుంచి అలవాటు పడాలి. నటీనటులు చాలా ఎక్కువ సమయం సెట్స్ లో అలసిపోతారు. అందుకే ఫిట్ నెస్ చాలా ఎక్కువ స్థాయిలో ఉండాలి. ఆహారం ఇందులో చాలా పెద్ద భాగం. ఇది నిర్లక్ష్యం చేయకూడనిది. శరీరం పనిచేయడానికి సరైన మొత్తంలో ఇంధనాన్ని ఉంచాలి" అని తెలిపింది. చిట్టి పొట్టి నిక్కర్లలో.. లోదుస్తుల్లో అందాలు ఆరబోసినా ఫిట్నెస్ పర్ఫెక్ట్ గా ఉంటేనే అందం ఏదైనా అందరికీ కనెక్టవుతుందని అమ్మడి వాలకం చెబుతోంది.






# ఈ సెకండ్ హీరోయిన్ సెంటిమెంట్ ఏంటి రాజా?

మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం ఖిలాడీ సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. రమేష్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమాలో ఇద్దరు ముద్దుగుమ్మలు నటిస్తున్నారు. రవితేజ గతంలో కూడా చాలా సినిమాల్లో ఇద్దరు హీరోయిన్స్ తో రొమాన్స్ చేసిన దాఖలాలు ఉన్నాయి. ఇద్దరు హీరోయిన్స్ ఉన్న సినిమాలు కొన్ని సక్సెస్ అయ్యాయి. ఖిలాడీపై కూడా అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ కారణంగానే రవితేజ తన తదుపరి సినిమాల్లో కూడా ఇద్దరు హీరోయిన్స్ తో రొమాన్స్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.ఇటీవలే రవితేజ హీరోగా కొత్త దర్శకుడు శరత్ మండవ దర్శకత్వంలో ఒక సినిమా సినిమా ప్రారంభం అయ్యింది. ఆ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారం భం అవ్వాల్సి ఉన్నా కూడా కరోనా కారణంగా వాయిదా పడ్డ విషయం తెల్సిందే. రవితేజ.. శరత్ ల కాంబో సినిమాలో మజిలీ సెకండ్ హీరోయిన్ దివ్యన్షా కౌశిక్ ను ఎంపిక చేయడం జరిగింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో మరో హీరోయిన్ ను ఎంపిక చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఆ హీరోయిన్ ఎవరు అనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది.అయిదు పదుల వయసు దాటిన రవితేజ ఇప్పుడు వరుసగా ఇద్దరు హీరోయిన్స్ తో నటించేందుకు ఆసక్తి చూపించడం విడ్డూరంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రవితేజ మరియు త్రినాధ రావు నక్కని ల కాంబోలో కూడా ఒక సినిమా రూపొందబోతుంది. ఈ ఏడాది లోనే ఆ సినిమా కూడా పట్టాలెక్కే అవకాశం ఉందని అంటున్నారు. త్వరలోనే ఆ సినిమా అధికారికం గా ప్రకటించే



అవకాశం ఉంది. ఆ సినిమా లో కూడా ఇద్దరు హీరోయిన్స్ ఉండే అవకాశం ఉందేమో అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు. త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# ఆస్ట్రేలియాలో 'అగ్రజీత' చిత్రం ఆరంభం

రాహుల్ కృష్ణ మరియు ప్రియాంక నోముల హీరోహీరోయిన్లుగా సందీప్ రాజ్ దర్శకత్వంలో సందీప్ రాజ్ ఫిలిమ్స్ మరియు వాసవి త్రివేది ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'అగ్రజీత'. ఈ చిత్రాన్ని ఆస్ట్రేలియా దేశంలో డాండెనాంగ్ సిటీలోని శివ విష్ణు ఆలయంలో పూజా కార్యక్రమాలతో ఆరంభించారు. ఈ చిత్రాన్ని పూర్తిస్థాయిలో ఆస్ట్రేలియాలోనే చిత్రీకరించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.ఈ సందర్భంగా దర్శకుడు సందీప్ రాజ్ మాట్లాడుతూ.. "అగ్రజీత ఒక భిన్నమైన కథ. ఒక జీవి మరణం అనంతరం తన జ్ఞాపకాలను అణువు ద్వారా మరో జీవిలోకి వెళ్లే ఒక శాస్త్రీయ కథ. మంచి కథతో, అత్యద్భుతమైన గ్రాఫిక్ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాము. ఈ చిత్రాన్ని మొత్తం ఆస్ట్రేలియా దేశంలోనే చిత్రీకరిస్తాం. రాహుల్ కృష్ణ మరియు ప్రియాంక నోముల హీరోహీరోయిన్లుగాగా నటిస్తున్నారు. మా చిత్ర రెగ్యులర్ షూటింగ్ పూజా కార్యక్రమాలతో మొదలైంది" అని తెలిపారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**